TELUGU & ENGLISH డిజిటల్ మీడియా | FAST NEWS | VIDEO NEWS | e-PAPER | DIGITAL SERVICES | 24/7

టీ-మీడియా

సామాజికం ... ప్రజల పక్షం ... 24/7 ప్రజా సేవలో...

వార్తలు | వీడియోలు | ఫోటోలు | ఇంటర్వ్యూలు | ప్రజా సమస్యలు | ప్రత్యేక కథనాలు | విశ్లేషణలు

epaper,www.tmedia.net.in | YouTube | facebook

శనివారం 31/10/2026 టీమీడియా మెయిన్ ఎడిషన్ ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

13 జిల్లాల్లో ఎల్‌పీజీ సిలిండర్ల డెలివరీకి

ఓటీపీ నుంచి తాత్కాలిక మినహాయింపు



(మిగతా 2లో)

550 ఎకరాలను కొట్టేసేందుకు కేసీఆర్ ప్రయత్నించారు

⏭ రూ.50 వేల కోట్ల విలువైన భూములను కాపాడాం ⏭ బీఆర్ఎస్ నేతలపై సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపణలు



టీ మీడియా, అక్టోబర్ 30, హైదరాబాద్ బ్యూరో:
మియాపూర్‌లోని 550 ఎకరాల ,విలువైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకునేందుకు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు వివిధ మార్గాల్లో ప్రయత్నించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఈ భూముల వ్యవహారంలో గోల్డ్‌స్టోన్ ప్రసాదరావు కీలకంగా వ్యవహరించారని, బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు దామోదరరావుకు ఖరీదైన కారును బహుమతిగా ఇచ్చిన అంశాన్ని కూడా సీఎం ప్రస్తావించారు. శుక్రవారం దిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన మియాపూర్ భూముల వివాదం, తమ ప్రభుత్వం చేపట్టిన న్యాయపోరాటం తదితర అంశాలపై వివరించారు.

కేసీఆర్ సర్కారు పట్టించుకోలేదు

మియాపూర్‌లోని 550 ఎకరాల ప్రభుత్వ భూములను కాపాడేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని రేవంత్‌రెడ్డి విమర్శించారు. కొందరు అధికారులను అడ్డుపెట్టుకుని భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించారని, ఈ వ్యవహారంలో సంబంధిత అధికారులు కూడా అరెస్టయ్యారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ భూముల వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. సుప్రీంకోర్టులో సమర్థవంతమైన వాదనలు వినిపించి సుమారు రూ.50 వేల కోట్ల విలువైన ఆస్తులను కాపాడుకోగలిగామని వెల్లడించారు. కోర్టు తీర్పు వెలువడిన వెంటనే భూములను స్వాధీనం చేసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.

దళిత, బహుజనుల ప్రయోజనాలకు వినియోగం

మియాపూర్ భూములను ప్రజాప్రయోజనాల కోసమే వినియోగిస్తామని సీఎం స్పష్టం చేశారు. అవసరమైతే ఈ భూములను వేలం వేసి, వచ్చిన ఆదాయాన్ని దళిత, బహుజన వర్గాల అభ్యున్నతికి ఖర్చు చేస్తామని ప్రకటించారు. గతంలో ఎంపీగా ఉన్న సమయంలో భూకబ్జాలపై పోరాడినందుకు తనను కక్షపూరితంగా జైలుకు పంపించారని గుర్తుచేశారు. భూముల విక్రయం ద్వారా వచ్చే నిధులను సాగునీరు, విద్య, వైద్యం వంటి కీలక రంగాలకు కేటాయించే అంశాన్ని పరిశీలిస్తున్నామని, దీనిపై మంత్రివర్గంలో చర్చిస్తామని తెలిపారు.

అనేక ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల పరిరక్షణ

కంచె గచ్చిబౌలి, మామిడిపల్లి భూముల విషయంలో బీఆర్ఎస్ నాయకులు ఆక్రమణలకు ప్రయత్నించగా న్యాయపోరాటం ద్వారా వాటిని కాపాడినట్లు రేవంత్‌రెడ్డి తెలిపారు. గుర్రంగూడలో అటవీ భూములను కేటీఆర్ అనుచరులు ఆక్రమించేందుకు ప్రయత్నించగా సుప్రీంకోర్టును ఆశ్రయించి పరిరక్షించామన్నారు. (మిగతా 2లో)

ఆరు రాష్ట్రాల్లో 'ఎస్ఐఆర్' గడువు పొడిగింపు



⏭ అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణకు అదనపు సమయం

టీ మీడియా, అక్టోబర్ 30, ఢిల్లీ బ్యూరో:
ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు సంబంధించి భారత ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా ఆరు రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ గడువును పొడిగిస్తూ సవరించిన షెడ్యూల్‌ను ప్రకటించింది. ఆయా రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారుల అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, హరియాణా, మహారాష్ట్ర, నాగాలాండ్, ఢిల్లీ రాష్ట్రాల్లో ఈ ప్రక్రియకు సంబంధించిన గడువులను సవరించింది. తెలంగాణలో ఓటర్ల జాబితాలో పేర్లు లేనివారు, వివరాల్లో తప్పులు ఉన్నవారు, ఇతర అభ్యంతరాలు కలిగినవారు నవంబర్ 26 వరకు దరఖాస్తులు సమర్పించేందుకు అవకాశం కల్పించింది. ఓటర్ల తుది జాబితాను నవంబర్ 30న ప్రచురించనున్నట్లు షెడ్యూల్‌లో పేర్కొంది.

సవరించిన షెడ్యూల్ ఇలా..

ఆంధ్రప్రదేశ్: నవంబర్ 20హరియాణా: నవంబర్ 20,నాగాలాండ్: నవంబర్ 25,మహారాష్ట్ర: నవంబర్ 25, (మిగతా 2లో)

ఇజ్రాయెల్ ఎన్నికల తుది ఫలితాల వెల్లడి



⏭ అతిపెద్ద పార్టీగా అవతరించిన నెతన్యాహు లికుడ్

టీ మీడియా, అక్టోబర్ 30, ఢిల్లీ బ్యూరో:
ఇజ్రాయెల్ సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు పూర్తయింది. ఆ దేశ కేంద్ర ఎన్నికల కమిటీ ప్రకటించిన తుది సీట్ల కేటాయింపులో బెంజమిన్ నెతన్యాహు నేతృత్వంలోని లికుడ్ పార్టీ 27 స్థానాలతో అతిపెద్ద పార్టీగా అవతరించింది. అయితే నెతన్యాహు (మిగతా 2లో)

బస్తాపై 26 కిలోలు.. తూకం వేస్తే 24 కేజీలే!



⏭ బియ్యం వ్యాపారుల మోసాలు బట్టబయలు

⏭ లైసెన్సులు లేకుండానే వ్యాపారాలు

టీ మీడియా, అక్టోబర్ 30, హైదరాబాద్ బ్యూరో:
26 కిలోల బియ్యం బస్తా.. తూకం వేస్తే 24.960 కిలోలే! అంటే ఒక్కో బస్తాపై ఏకంగా 1.040 కిలోల బియ్యం తక్కువ. మరోవైపు సరైన లైసెన్సులు లేకుండానే వ్యాపారాలు నిర్వహణ, ధ్రువీకరణ లేని తూకపు యంత్రాల వినియోగం.. ఇలా హైదరాబాద్‌లోని పలువురు బియ్యం వ్యాపారుల అక్రమాలు (మిగతా 2లో)

ప్రతి ఒక్కరినీ ఆదుకుంటాం

⏭ ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించాం: సీఎం చంద్రబాబు

టీ మీడియా, అక్టోబర్ 30, మొగల్తూరు :
అర్నబ్ తుపాను మృతులకు 5 లక్షల రూపాయల తక్షణ సాయం అందించినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. విపత్తును ముందే గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయడం వల్ల పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించామని చెప్పారు. (మిగతా 2లో)





13 జిల్లాల్లో ఎల్‌పీజీ సిలిండర్ల డెలివరీకి

● ఓటీపీ నుంచి తాత్కాలిక మినహాయింపు

టీమీడియా , అక్టోబర్ 30 , అమరావతి బ్యూరో :

అర్నబ్ ప్రభావంతో రాష్ట్రంలోని 13 జిల్లాల్లో గృహవినియోగ ఎల?పీజీ గ్యాస్ సిలిండర్ల డెలివరీ సమయంలో ఓటీపీ నుంచి తాత్కాలిక మినహాయింపు కలిగింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు వినియోగదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా గ్యాస్ సిలిండర్ల సరఫరా సజావుగా కొనసాగించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈ తాత్కాలిక వెసులుబాటు రాష్ట్రంలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పోలవరం, విశాఖ, అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా జిల్లాల్లో వర్తించనుంది. ప్రస్తుత పరిస్థితుల్లో సాంకేతిక సమస్యల కారణంగా ఓటీపీ ధ్రువీకరణలో ఇబ్బందులు తలెత్తకుండా గృహ వినియోగదారులకు సకాలంలో గ్యాస్ సిలిండర్లు అందించేందుకు ఈ మినహాయింపు దోహదపడనుంది. నగదు చెల్లింపు ద్వారా సిలిండర్లను నేరుగా పొందే విధానానికి కూడా అనుమతి కల్పించినట్లు వెల్లడించింది.

550 ఎకరాలను కొట్టేసేందుకు కేసీఆర్ ప్రయత్నించారు

(మొదటి పేజీ తరువాయి)

మంచిరేవులలోని 143 ఎకరాల భూమిని కేటీఆర్ రాయలసీమ బిల్డర్స్‌తో కలిసి స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. ప్రస్తుతం ఆ భూమిలో పోలీసుల పిల్లల కోసం పాఠశాలను నిర్మించినట్లు చెప్పారు.జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 400 ఎకరాల అటవీ భూమిని బీఆర్ఎస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేకు అప్పగించారని, ఆ భూమిని కూడా ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు సీఎం వెల్లడించారు. ఎల్బీనగర్‌లో 150 ఎకరాలను అటవీ ప్రాంతంగా మార్చినట్లు తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ మూడేళ్లలో సుమారు రూ.1.50 లక్షల కోట్ల విలువైన భూములను ఆక్రమణల నుంచి కాపాడినట్లు పేర్కొన్నారు.

హరీశ్‌రావు మామపై ఆరోపణలు

మాజీ మంత్రి హరీశ్‌రావు మామ హనుమంతరావు ఆక్రమణలో ఉన్నాయని ఆరోపిస్తున్న భూములపై అధికారులు సర్వే నిర్వహించకుండా అడ్డుకుంటున్నారని సీఎం విమర్శించారు. ఈ వ్యవహారంలో కోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారని ఆరోపించారు. భూ ఆక్రమణల అంశంపై అసెంబ్లీలో చర్చకు సిద్ధమని, బీఆర్ఎస్ నాయకులు సభకు వచ్చి తమ వాదనలు వినిపించాలని సవాల్ విసిరారు. మియాపూర్ భూముల విషయంలో ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వచ్చినప్పటికీ బీఆర్ఎస్ నేతలు స్పందించకపోవడంపై ప్రశ్నలు లేవనెత్తారు.

పద్మాలయ, ల్యాంకో భూములపై ప్రశ్నలు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పద్మాలయ స్టూడియో, ల్యాంకో భూములపై కేసులు వేసిన కేసీఆర్, హరీశ్‌రావులు అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని ఎందుకు స్వాధీనం చేసుకోలేదని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. గతంలో ఎవరిపై కేసులు వేశారో, అధికారంలోకి వచ్చాక వారితోనే రాజీ పడ్డారని ఆరోపించారు. మియాపూర్ భూములపై ఇకనైనా అనవసర వివాదాలు సృష్టించకుండా ఉండాలని బీఆర్ఎస్ నాయకులకు సూచించారు.

మియాపూర్ భూములను పరిశీలించిన కలెక్టర్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి మియాపూర్‌లోని సర్వే నంబర్లు 100, 101లో ఉన్న భూములను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ భూములు హెచ్ఎండీఏ ఆధీనంలోనే ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే 400 ఎకరాలకు ఫెన్సింగ్ ఏర్పాటు చేశామని, మిగిలిన భూములకు కూడా త్వరలో ఫెన్సింగ్ పూర్తి చేస్తామని చెప్పారు.

ఆరు రాష్ట్రాల్లో 'ఎస్ఐఆర్' గడువు పొడిగింపు

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ: నవంబర్ 26, ఢిల్లీ: డిసెంబర్ 15.ఇక ఢిల్లీలో అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణ గడువును అక్టోబర్ 30 నుంచి నవంబర్ 25 వరకు పొడిగించారు. వాటి పరిష్కారానికి నవంబర్ 30 వరకు ఉన్న గడువును డిసెంబర్ 12 వరకు పెంచారు. ఓటర్ల తుది జాబితాను డిసెంబర్ 22న ప్రచురించనున్నారు.

దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియ

ఓటర్ల జాబితాల్లో పారదర్శకత పెంచడం, అర్హులైన పౌరులందరికీ ఓటు హక్కు కల్పించడం, అనర్హులు, డూప్లికేట్ ఓటర్లను గుర్తించడం లక్ష్యంగా ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను చేపట్టింది. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ పూర్తయింది. మూడో దశలో భాగంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, హరియాణా, మహారాష్ట్ర, నాగాలాండ్, ఢిల్లీలో ఈ ప్రక్రియ కొనసాగుతోంది.ఈ దశ పూర్తయితే జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, లద్దాఖ్ మినహా దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తికానుంది.

బస్తాపై 26 కిలోలు.. తూకం వేస్తే 24 కేజీలే!

(మొదటి పేజీ తరువాయి)

విజిలెన్స్, పౌరసరఫరాల శాఖ అధికారుల తనిఖీల్లో వెలుగుచూశాయి. ప్రత్యేక బృందాలతో నగరంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టిన అధికారులు, నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపార సంస్థలపై కేసులు నమోదు చేశారు.

బస్తాపై కిలోకు పైగా తక్కువ తూకం

హైదరాబాద్‌లోని అంబర్‌పేట, ఖైరతాబాద్, సికింద్రాబాద్, మెహిదీపట్నం, నాంపల్లి సర్కిళ్ల పరిధిలో పౌరసరఫరాల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. సుమారు 10 బియ్యం వ్యాపార సంస్థలు నిబంధనలను ఉల్లంఘించినట్లు గుర్తించి కేసులు నమోదు చేశారు. రెండు ప్రముఖ వ్యాపార సంస్థల్లో తూకం మోసాలు బయటపడ్డాయి. 26 కిలోలు ఉండాల్సిన 'గజరాజ్' బ్రాండ్ బియ్యం బస్తాను తూకం వేయగా 24.960 కిలోలు మాత్రమే ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఒక్కో బస్తాపై 1.040 కిలోల బియ్యం తక్కువగా ఇస్తూ వినియోగదారులను మోసగిస్తున్నట్లు వెల్లడించారు.

లైసెన్సులు లేకుండానే వ్యాపారాలు

కనీసం ట్రేడ్ లైసెన్స్ కూడా లేకుండా పలు సంస్థలు వ్యాపారాలు నిర్వహిస్తున్నట్లు తనిఖీల్లో గుర్తించారు. మరికొన్ని దుకాణాల్లో జీఎస్టీ రిజిస్ట్రేషన్, ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులకు సంబంధించి లోపాలు బయటపడ్డాయి. లీగల్ మెట్రాలజీ శాఖ ధ్రువీకరణ లేని, సీల్ గడువు ముగిసిన తూకపు యంత్రాలను వినియోగించడం, కొన్ని చోట్ల అసలు తూకం వేయకుండానే వ్యాపారాలు నిర్వహించడం వంటి ఉల్లంఘనలు గుర్తించారు. మొత్తం 10 వ్యాపార సంస్థలపై కేసులు నమోదు చేసినట్లు సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర వెల్లడించారు.

పలువురు వ్యాపారులపై కేసులు

ముషీరాబాద్‌లోని క్వాలిటీ ట్రేడర్స్, శివానీ ట్రేడర్స్, ఎస్సార్ నగర్‌లోని వరలక్ష్మీ ట్రేడర్స్‌కు ట్రేడ్ లైసెన్స్ లేకపోవడంతో యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఖైరతాబాద్‌లోని వరలక్ష్మీ ట్రేడర్స్ వద్ద 26 కిలోల బియ్యం బస్తాల్లో తక్కువ తూకం ఉన్నట్లు గుర్తించి లీగల్ మెట్రాలజీ చట్టం కింద కేసు నమోదు చేశారు.వారాసిగూడలోని పడలక్ష్మీ నారాయణ అండ్ సన్స్ దుకాణంలో గుర్తింపు లేని తూకపు కాటాను వినియోగిస్తున్నందుకు యజమాని మాధవిపై కేసు నమోదు చేశారు. సికింద్రాబాద్ శ్రీనివాస్ నగర్‌లోని భాగ్యలక్ష్మీ రైస్ డిపోలో జీఎస్టీ లైసెన్స్ లేకపోవడంతో పాటు 26 కిలోల బస్తాలో 24.960 కిలోల బియ్యం మాత్రమే ఉండటంతో కేసు నమోదు చేశారు.

తయారీదారు వివరాలు లేకుండానే విక్రయాలు

గోల్కొండలోని బాలకృష్ణ రైస్ అండ్ జనరల్ స్టోర్‌కు ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ లేకపోవడంతో పాటు తూకం యంత్రం ధ్రువీకరణ పత్రం గడువు ముగియడంతో యజమాని కవితపై కేసు నమోదు చేశారు. అదే ప్రాంతంలోని భగత్ సింగ్ కిరాణా అండ్ జనరల్ స్టోర్ బియ్యం బస్తాలపై ప్యాకేజీ తయారీదారు వివరాలు ముద్రించకపోవడంతో రాజ్‌కుమార్ సింగ్‌పై కేసు పెట్టారు.

గుడిమల్కాపూర్‌లోని సాయి విజయ రైస్ డిపో బస్తాలపై తయారీదారు చిరునామా లేకపోవడంతో యజమాని విజయ్‌పై కేసు నమోదు చేశారు. బేగంబజార్‌లోని పంకజ్ ట్రేడర్స్ దుకాణంలో తూకపు యంత్రాన్ని వినియోగించకపోవడంతో యజమాని హరీశ్ పన్వార్‌పై లీగల్ మెట్రాలజీ చట్టం కింద కేసు నమోదు చేశారు.

రేషన్ బియ్యం ఉన్నట్లు అనుమానాలు

కర్మాన్‌ఘాట్‌లో నిర్వహించిన తనిఖీల్లో పలు రైస్ షాపుల్లో కొనుగోలు రసీదులు, నిల్వ ఉన్న బియ్యం స్టాక్ మధ్య తేడాలను అధికారులు గుర్తించారు. కొన్ని దుకాణాల్లో రేషన్ బియ్యం ఉన్నట్లు అనుమానించి నమూనాలను సేకరించి ప్రయోగశాలకు పంపించారు. మరికొన్ని షాపులు ట్రేడ్ లైసెన్స్ లేకుండానే నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. రిజిస్టర్డ్ బ్రాండ్లకు బదులుగా సొంత లోగోలతో బియ్యం విక్రయిస్తున్న అంశంపైనా అధికారులు దృష్టి సారించారు.

ప్రతి ఒక్కరినీ ఆదుకుంటాం

(మొదటి పేజీ తరువాయి)

పునరుద్ధరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయన్న ముఖ్యమంత్రి, నష్టపోయిన ప్రతి ఒక్కరినీ ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.తుపాను ప్రభావిత ప్రాంతాల్లో రెండో రోజు సీఎం చంద్రబాబు పర్యటించారు. పశ్చిమగోదావరి జిల్లమండలం మెట్రేవుల్లో పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. బాధితులను పరామర్శించారు. పునరావాస కేంద్రంలో భోజన వసతులు, సౌకర్యాలపై ఆరా తీశారు. అధికారులు తమకు సౌకర్యాలన్నీ కల్పిస్తున్నారని గ్రామస్థులు తెలపగా, ధైర్యంగా ఉండాలని అన్ని విధాలా ఆదుకుంటామని సీఎం వారికి భరోసా ఇచ్చారు. తుపాను నష్టాలు ఒక్కొక్కటీ పరిష్కరిస్తున్నామన్నారు. బాధితులకు నిత్యావసర సరకులు అందిస్తామని, బోట్లు కోల్పోయిన మత్స్యకారులను ఆదుకుంటామని సీఎం భరోసా ఇచ్చారు.

పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తి నష్టం నివారణ తుపాను తీవ్రతను ముందే గుర్తించి అప్రమత్తం చేయడం వల్ల పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఎక్కడికక్కడ జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ఇబ్బందులు తప్పాయన్నారు. కూలిన చెట్ల తొలగింపు వేగంగా జరుగుతుందని విద్యుత్ స్తంభాలను చురుగ్గా పునరుద్ధరిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ నుంచి వచ్చిన సిబ్బంది పునరుద్ధరణ పనుల్లో పాలుపంచుకుంటున్నట్లు వివరించారు. రేపు సాయంత్రం లేదా ఎల్లుండినాటికి జిల్లాలో ప్రతి ఇంటికీ విద్యుత్ పునరుద్ధరిస్తామన్నారు. గ్రామాల్లో చివరి వ్యక్తికీ సాయం అందే వరకు పర్యవేక్షిస్తానని చెప్పారు.

ఇజ్రాయెల్ ఎన్నికల తుది ఫలితాల వెల్లడి

(మొదటి పేజీ తరువాయి)

నేతృత్వంలోని కూటమికి 53 స్థానాలు మాత్రమే లభించాయి. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 61 స్థానాల మెజారిటీకి మరో ఎనిమిది సీట్లు తక్కువగా ఉండటంతో ఇజ్రాయెల్‌లో తదుపరి ప్రభుత్వం ఏర్పాటుపై ఉత్కంఠ నెలకొంది.

గాడి ఐసెన్‌కోట్ నేతృత్వంలోని యషార్ పార్టీ 21 స్థానాలతో రెండో స్థానంలో నిలిచింది. నఫ్తాలి బెన్నెట్ సారథ్యంలోని బియాహాద్ పార్టీకి 12, జాయింట్ లిస్ట్‌కు 11 స్థానాలు లభించాయి. డెమోక్రాట్స్, రా'అమ్ పార్టీలు చెరో ఎనిమిది స్థానాలు సాధించాయి. యిస్రాయెల్ బైతేను, యునైటెడ్ తోరా జుడాయిజం, ఓట్జ్మా యెహూదిత్ పార్టీలు ఏడేసి స్థానాలు గెలుచుకున్నాయి. షాస్, రిలిజియస్ జియోనిజం పార్టీలు ఆరేసి స్థానాలు దక్కించుకున్నాయి.

మొత్తం 120 స్థానాలున్న ఇజ్రాయెల్ పార్లమెంటులో నెతన్యాహూ అనుకూల కూటమికి 53, ప్రతిపక్ష కూటమికి 48, అరబ్ పార్టీలకు 19 స్థానాలు లభించాయి. దీంతో ఏ కూటమికీ స్పష్టమైన మెజారిటీ దక్కలేదు. ఈ ఎన్నికల్లో అర్హులైన ఓటర్లలో 77.9 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 57,16,665 ఓట్లు పోలయ్యాయి.

3.25 శాతం ఓట్లు దాటని పార్టీలు

ఇజ్రాయెల్ పార్లమెంటులో ప్రాతినిధ్యం పొందేందుకు అవసరమైన కనీసం 3.25 శాతం ఓట్ల పరిమితిని కొన్ని పార్టీలు చేరుకోలేకపోయాయి. రిజర్విస్టులు 2.7 శాతం, పీపుల్ ఆఫ్ ఇజ్రాయెల్ 1.7 శాతం, చారెడి పబ్లిక్ పార్టీ 0.2 శాతం ఓట్లు మాత్రమే సాధించాయి. దీంతో ఆ పార్టీలు పార్లమెంటులో ప్రాతినిధ్యం పొందే అవకాశం కోల్పోయాయి.

నవంబర్ 4న రాష్ట్రపతికి అధికారిక ఫలితాలు

ఎన్నికల ఫలితాలపై వచ్చిన అభ్యంతరాలు, పొరపాట్ల పరిశీలన పూర్తయిన అనంతరం నవంబర్ 4న అధికారిక ఫలితాలను ఎన్నికల సంఘం అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్‌కు సమర్పించనుంది. కొత్తగా ఎన్నికైన కెసెనెట్ (ఇజ్రాయెల్ పార్లమెంట్) నవంబర్ 10న ప్రమాణ స్వీకారం చేయనుంది.

అధికారిక ఫలితాల సమర్పణ అనంతరం అధ్యక్షుడు వివిధ పార్టీల ప్రతినిధులతో సంప్రదింపులు జరిపి ప్రభుత్వ ఏర్పాటుకు ఒక నాయకుడిని ఆహ్వానిస్తారు. ఆ నాయకుడు నిర్ణీత సమయంలో 61 మంది సభ్యుల మద్దతును నిరూపించుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ మెజారిటీ సాధించలేకపోతే మరో నాయకుడికి అవకాశం కల్పించవచ్చు. ఈ ప్రయత్నాలు కూడా విఫలమైతే మళ్లీ ఎన్నికలు నిర్వహించే పరిస్థితి ఏర్పడవచ్చు.

నెతన్యాహూకు మిలే అభినందనలు

లికుడ్ పార్టీ అత్యధిక స్థానాలు సాధించడంపై అర్జెంటీనా అధ్యక్షుడు ఖావియర్ మిలే స్పందించారు. నెతన్యాహూకు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల్లో అంచనాలను అధిగమిస్తూ లికుడ్ మరోసారి ఇజ్రాయెల్‌లో అతిపెద్ద రాజకీయ శక్తిగా నిలిచిందని పేర్కొన్నారు. ఇజ్రాయెల్, అర్జెంటీనా దేశాలు వ్యూహాత్మక మిత్రపక్షాలుగా కొనసాగుతాయని వెల్లడించారు.

మైనారిటీ ప్రభుత్వ ఏర్పాటుపై సందేహాలు

ఇజ్రాయెల్‌లో ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో మైనారిటీ ప్రభుత్వ ఏర్పాటుపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అరబ్ పార్టీల మద్దతుతో యషార్ పార్టీ నేత గాడి ఐసెన్‌కోట్ నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశాలపై రా'అమ్ పార్టీ నాయకుడు మన్సూర్ అబ్బాస్ అనుమానాలు వ్యక్తం చేసినట్లు సమాచారం. నెతన్యాహూను వ్యతిరేకిస్తున్న ప్రతిపక్ష కూటమి సైతం సొంతంగా మెజారిటీ సాధించలేకపోవడంతో ప్రత్యామ్నాయ రాజకీయ సమీకరణాలపై చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

ఎన్నికల అక్రమాలపై ఆరోపణలు

ఇదిలా ఉండగా, ఎన్నికల్లో అక్రమాలు జరిగినట్లు కొన్ని పార్టీలు ఆరోపించాయి. ఈ ఆరోపణలపై విచారణ జరపాలని ఎన్నికల సంఘాన్ని కోరాయి. అరబ్ ప్రాంతాల్లో ఓటింగ్ సరళిని ప్రభావితం చేసేందుకు విదేశీ సంస్థలు ప్రయత్నించి ఉండవచ్చనే అనుమానాలు కూడా వ్యక్తమయ్యాయి. అయితే ఎన్నికల ప్రక్రియలో వ్యవస్థాగత అక్రమాలు జరిగినట్లు నిర్ధారించే ఆధారాలు లేవని ఎన్నికల అధికారుల వైఖరిని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి.మొత్తంగా, లికుడ్ అతిపెద్ద పార్టీగా నిలిచినప్పటికీ నెతన్యాహూ కూటమికి మెజారిటీ దక్కకపోవడం ఇజ్రాయెల్ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీస్తోంది. తదుపరి ప్రభుత్వం ఎవరి నాయకత్వంలో, ఏయే పార్టీల మద్దతుతో ఏర్పడుతుందనేది ఆసక్తికరంగా మారింది.

ప్రచారమే తప్ప.. సింగరేణికి అభివృద్ధి ఏది?

● సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కే.నరేంద్ర

టీ మీడియా,అక్టోబర్30,సింగరేణి(కారేపల్లి):

కాంగ్రెస్ పాలకులు పిసరంత పని చేసి కొండంత గొప్పలు చెప్పుకుంటున్నారని సీపీఐ(ఎం) సింగరేణి మండల కార్యదర్శి కే.నరేంద్ర విమర్శించారు.శుక్రవారం కారేపల్లిలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ సింగరేణి మండలంలో అనేక సమస్యలు ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోకుండా ఉన్నాయని పేర్కొన్నారు.వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ తన హయాంలోనే సీతారామ ప్రాజెక్టు ద్వారా రూ.100 కోట్లు మంజూరు చేయించి నియోజకవర్గానికి నీళ్లు తీసుకొచ్చానని చెబుతున్నారని,అందులో వాస్తవం లేదని నరేంద్ర ఆరోపించారు.వ్యవసాయ మంత్రి సొంత ప్రాంతానికి నీటిని తీసుకెళ్తూ పిల్లకాలువను వైరా చెరువుకు మళ్లించారనే విషయం అందరికీ తెలుసన్నారు.సీతారామ కాలువల కోసం వైరా నియోజకవర్గ రైతుల భూములు తీసుకున్నప్పటికీ బాధితులకు సరైన పరిహార ప్యాకేజీ అందలేదని పేర్కొన్నారు.సీతారామ ప్రాజెక్టు కోసం సింగరేణి మండలంలోని గిరిజన,గిరిజనేతర పేదలు భూములు కోల్పోయారని,కానీ మండలంలోని



భూములకు ఒక్క చుక్క సాగు,తాగునీరు కూడా అందడం లేదని విమర్శించారు.సింగరేణి మండలానికి సీతారామ జలాలు తీసుకురావడానికి ప్రభుత్వంపై ఒత్తిడి చేయాల్సిన ఎమ్మెల్యే ఆ అంశంపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు.మండలంలో విద్యారంగ పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయని నరేంద్ర పేర్కొన్నారు.మండలానికి డిగ్రీ కళాశాల,బీసీ హాస్టల్‌కు సొంత భవనం,కళాశాల ఎస్సీ హాస్టల్‌కు సొంత భవనం అవసరమన్నారు.మండల కేంద్రంలో ఎస్సీ,ఎస్టీ బాలబాలికల హాస్టళ్లు ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే ఎందుకు కృషి చేయడం లేదని ప్రశ్నించారు.వైద్యరంగంలోనూ పరిస్థితి దారుణంగా ఉందన్నారు.మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కనీసం అవసరమైన మందులు కూడా అందుబాటులో లేవని ఆరోపించారు.పీహెచ్‌సీని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)గా అప్‌గ్రేడ్ చేయాలని ప్రజలు కోరుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.పోడు భూముల విషయంలో ఎంతో కృషి చేశామని ఎమ్మెల్యే చెప్పుకుంటున్నారని,అయితే ఎర్రబోడు ప్లాంటేషన్ బాధిత రైతులకు ఇచ్చిన హామీ ఇప్పటికీ నెరవేరలేదన్నారు.పోడు భూములపై హక్కులు,విద్యుత్ సౌకర్యం,సాగునీటి బోర్ల కోసం సీపీఐ(ఎం) చేసిన పోరాటాల ఫలితంగానే గతంలో కొన్ని సదుపాయాలు వచ్చాయని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోడు భూముల రక్షణ,సాగుదారులకు హక్కు పత్రాల విషయంలో ఆశించిన చర్యలు జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ఎమ్మెల్యే సింగరేణి మండల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి,ప్రచారానికి పరిమితం కాకుండా ప్రజలకు ఉపయోగపడేలా పదికాలాలు నిలిచే అభివృద్ధి పనులు చేపట్టాలని కే.నరేంద్ర కోరారు.

రోడ్డు ప్రమాదంలో హార్టికల్చర్ ఉద్యోగి మృతి

టీ మీడియా, అక్టోబర్ 30 ,పెబ్బేరు:

వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం లోని వై శాఖపూర్ గ్రామానికీ చెందిన కె విక్రమ్ కుమార్ రెడ్డి తండ్రి సర్వా రెడ్డి మహారాష్ట్ర పూణేలో బీఎస్సీ అగ్రికల్చర్ చదువు పూర్తి చేసుకుని 2024 సంవత్సరంలో ఐ సి ఎ ఆర్ జాతీయ స్థాయి ఎంట్రన్స్ వ్రాసి ఐ ఎ బి ఎం కోర్సులో జాతీయ స్థాయి లో 13వ ర్యాంకు సంపాదించి అగ్రి బిజినెస్ మేనేజ్మెంట్ కోర్సులో రాజస్థాన్ లోని స్వామి కేశవానంద్ రాజస్థాన్ అగ్రికల్చర్ యూనివర్సిటీ లో చదువు పూర్తి చేసి ప్రవేట్ కంపెనిలో నాలుగు నెలల క్రితం హార్టి కల్చర్ ఉద్యోగిగా ఖమ్మం జిల్లాలోని అశ్వరావు పేటలో అయిల్ ఫాం హర్టి కల్చర్ శాఖా ఉద్యోగంలో చేరి జీవితంలో స్థిరపడి కుటుంబాన్ని మంచిగా చూసుకునే సమయంలో గురువారం సాయంత్రం నాలుగు గంటలకు భద్రాద్రి కొత్తగూడెం సమీపంలో విక్రమ్ రెడ్డి బైక్ పై వెళ్తుండగా వెనుక వైపు నుంచి వస్తున్న బొగ్గు లారీ ఢీ కొట్టిన ప్రమాదంలో మరణించారు విక్రమ్ కుమార్ రెడ్డి మరణం కుటుంబానికి మన గ్రామానికి తీరని లోటు చాలా బాధాకరం అని



గ్రామ ప్రజలు శోక సంద్రంలో మునిగిపోయారు సర్వారెడ్డి కుటుంబానికి భగవంతుడు మనో ధైర్యం ప్రసాదించాలని కోరారు

కరెంట్ పోతే..
కారేపల్లి ఆసుపత్రిలో చీకట్లే!





⏭ పనిచేయని ఇన్వర్టర్లు..

టీ మీడియా,అక్టోబర్30,సింగరేణి(కారేపల్లి):

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాల్సిన కారేపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కనీస మౌలిక సదుపాయాల కొరతతో సమస్యల నిలయంగా మారుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.ముఖ్యంగా రాత్రివేళ విద్యుత్ సరఫరా నిలిచిపోతే ఆసుపత్రిలో చీకట్లు అలుముకుంటుండటంతో వైద్యసేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఆసుపత్రిలో అత్యవసర పరిస్థితుల్లో విద్యుత్ సరఫరాకు ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన ఇన్వర్టర్లు పనిచేయకపోవడం,సోలార్ విద్యుత్ వ్యవస్థ సైతం పూర్తిస్థాయిలో వినియోగంలో లేకపోవడంతో కరెంట్ పోయిన సమయంలో వైద్య సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది.కొన్ని సందర్భాల్లో సెల్‌ఫోన్ టార్చ్‌ల వెలుగులో వైద్యసేవలు అందించాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు సహా అవసరమైన వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశిస్తున్నప్పటికీ,అందుకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాలు క్షేత్రస్థాయిలో అందుబాటులో లేకపోవడం విమర్శలకు తావిస్తోంది.ముఖ్యంగా రాత్రివేళ గర్భిణులు,ప్రమాద బాధితులు,ఇతర అత్యవసర రోగులు ఆసుపత్రికి వస్తే విద్యుత్ కోత సమయంలో వైద్యం ఎలా అందిస్తారనే ప్రశ్న తలెత్తుతోంది.లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఇన్వర్టర్లు,సోలార్ వ్యవస్థలు అవసరమైన సమయంలో ఉపయోగపడకపోతే వాటి ఏర్పాటు వల్ల ప్రయోజనం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.వైద్యశాల వంటి అత్యవసర సేవల కేంద్రంలో నిరంతర విద్యుత్ సరఫరాతోపాటు ప్రత్యామ్నాయ విద్యుత్ వ్యవస్థ ఎప్పటికప్పుడు పనిచేసేలా పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు.ఇప్పటికైనా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించి ఆసుపత్రిలోని ఇన్వర్టర్లు,సోలార్ విద్యుత్ వ్యవస్థ పనితీరును పరిశీలించి తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.రాత్రివేళ విద్యుత్ కోత వచ్చినా వైద్యసేవలకు అంతరాయం కలగకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

పాట ఆవిష్కరించిన హరి నారాయణ గురూజి



టీ మీడియా, అక్టోబర్ 30 పెబ్బేరు:

వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో చీకటి చీకటి అనే భక్తి గీతాన్ని ఘనంగా విడుదల చేశారు హరి నారాయణ గురుస్వామి రచించి ఆలపించిన ఈ పాటను అయ్యప్ప స్వామి భక్తుల సమక్షంలో ఆవిష్కరించారు ఈ పాటను వి ఎం సి పెబ్బేరు యూట్యూబ్ ఛానల్ ద్వారా విడుదల చేసినట్లు నిర్మాత టియన్ ఎల్లారెడ్డి తెలిపారు ఈ సందర్భంగా పాట విడుదలకు సహకరించిన ఆలయ కమిటీ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు కార్యక్రమంలో అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు.

వరి, మొక్కజొన్న పంటలు వేయవద్దు



⏭ క్లస్టర్ బాధ్యులు ఎం.డి జానీ

టీ మీడియా, అక్టోబర్ 30, కూసుమంచి:

ఎల్ నినో ప్రభావం దృష్ట్యా భూగర్భ జలమట్టం తగ్గిపోతుందని, అందుకు యాసంగిలో రైతులు వరి, మొక్కజొన్న వంటి పంటలు వేయవద్దని , క్లస్టర్ బాధ్యులు ఎం.డి జానీ రైతులకు సూచించారు. శుక్రవారం కూసుమంచిలో రైతులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ నందు జరిగిన రైతుల సమావేశంలో జానీ మాట్లాడుతూ తక్కువ నీటితో సాగయ్యే పెసర ,మినుము, వేరుశనగ, జొన్న వంటి స్వల్పకాలిక పంటలను సాగు చేయాలన్నారు.

యాసంగిలో నీటి కొరత రైతులకు నీళ్లు అందించు విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి నీటిపారుదల శాఖ వారు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కొండా కృష్ణవేణి మహిపాల్, ఉప సర్పంచ్ చెన్ను వెంకటర మణ, జిపిఓ వసంతరావు, పంచాయతీ కార్యదర్శి , ఎలక్ట్రిసిటీ సిబ్బంది, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

46 సిమెంట్ రోడ్లకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి



⏭ రూ.5 కోట్లతో ఆరో వార్డులో అంతర్గత రహదారుల నిర్మాణం

టీ మీడియా,అక్టోబర్ 30 , ఖమ్మం రూరల్ :

ఏదులాపురం మున్సిపాలిటీ అభివృద్ధికి మరో ముందడుగు పడింది. మున్సిపాలిటీ ఆరో వార్డులో సుమారు రూ.5 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 46 అంతర్గత సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులకు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన, రోల్‌మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. పట్టణంలోని ప్రతి వార్డులో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.ఇప్పటికే మున్సిపాలిటీలోని మూడు డివిజన్ల పరిధిలో రూ.79.79 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. రానున్న రోజుల్లో మరో రూ.100 కోట్ల నుంచి రూ.150 కోట్ల వరకు నిధులు తీసుకొచ్చి పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు.ప్రతి కాలనీలో సిమెంట్ రోడ్లు, తాగునీటి సౌకర్యం, విద్యుత్ తదితర మౌలిక వసతులను మెరుగుపరిచి ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

హెవీ వాటర్ బోర్డు చీఫ్ కు సన్మానం



⏭ సర్పంచ్ బానోత్ సదర్ లాల్ ఆత్మీయ అభినందనలు

టీ మీడియా ,అక్టోబర్ 30 ,అశ్వాపురం:

అశ్వాపురం గౌతమి నగర్‌కు విచ్చేసిన హెవీ వాటర్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ వి.వి.ఎస్.ఏ. ప్రసాద్‌ను అశ్వాపురం గ్రామపంచాయతీ సర్పంచ్ బానోత్ సదర్ లాల్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా ఆయన ఉద్యోగ ప్రస్థానం, సాధించిన విజయాలను సర్పంచ్ గుర్తుచేసుకున్నారు. 1989లో మణుగూరులోని హెవీ వాటర్ ప్లాంట్‌లో కెమికల్ ఇంజనీర్‌గా తన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన ప్రసాద్, ప్రతిభ, అనుభవం, అంకితభావంతో అంచెలంచెలుగా ఎదిగారు. డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా, అనంతరం కోటా హెవీ వాటర్ ప్లాంట్‌లో జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు నిర్వహించారు. తదుపరి ముంబైలోని హెవీ వాటర్ బోర్డులో అసోసియేట్ డైరెక్టర్‌గా సేవలందించి, ప్రస్తుతం బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా ఉన్నత బాధ్యతలు చేపట్టడం విశేషమని పేర్కొన్నారు.గతంలో ఇద్దరూ కలిసి పనిచేసిన అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ, ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆత్మీయంగా ముచ్చటించుకున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ బానోత్ సదర్ లాల్ మాట్లాడుతూ, శాస్త్ర సాంకేతిక రంగంతో పాటు అణుశక్తి రంగంలో దేశ అభివృద్ధికి ప్రసాద్ మరిన్ని విశేష సేవలందించాలని ఆకాంక్షించారు. హెవీ వాటర్ బోర్డు ద్వారా నూతన ఉత్పత్తులు, పరిశోధనలు, సాంకేతిక విజయాలు సాధించి భారతదేశానికి మరింత పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని శుభాకాంక్షలు తెలిపారు.అశ్వాపురంలో తన ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించి, దేశస్థాయిలో అత్యున్నత బాధ్యతలు చేపట్టడం స్థానిక ప్రాంత ప్రజలకు గర్వకారణమని సర్పంచ్ సదర్ లాల్ సంతోషం వ్యక్తం చేశారు.

పనులు పెండింగ్.. బిల్లుల కోసం ఒత్తిడి



⏭ కాంట్రాక్టర్‌పై విద్యుత్ శాఖ డీఈ ఆరోపణలు

టీ మీడియా, అక్టోబర్ 30, ఖమ్మం రూరల్:

అసంపూర్తిగా ఉన్న విద్యుత్ పనులకు బిల్లులు చెల్లించాలని ఒత్తిడి చేస్తూ, నిబంధనల ప్రకారం వ్యవహరిస్తున్న అధికారులపై కాంట్రాక్టర్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఖమ్మం రూరల్ విద్యుత్ శాఖ డీఈ చింతమల నాగేశ్వరరావు ఆరోపించారు. పనులు పూర్తికాకుండానే బిల్లులు సమర్పించాలన్న కాంట్రాక్టర్ డిమాండ్‌కు అధికారులు అంగీకరించకపోవడంతోనే తమపై ఆరోపణలకు దిగుతున్నారని ఆయన పేర్కొన్నారు.శుక్రవారం ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 30వ వార్డులో ఉన్న ఖమ్మం రూరల్ సబ్ డివిజన్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఈ మాట్లాడారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు ప్రజలకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా పెద్ద లైన్ మార్పు పనుల కోసం రూ.37 లక్షలతో అంచనాలు రూపొందించినట్లు తెలిపారు.ఈ పనుల్లో భాగంగా చిన్న వెంకటగిరిలో ఆరు టవర్లు, చిన్నతండాలో నాలుగు టవర్లు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. చిన్న వెంకటగిరిలో చేపట్టిన పనులకు సంబంధించి కాంట్రాక్టర్‌కు ఎల్ఓసీ అందించినట్లు వెల్లడించారు. అయితే చిన్నతండాలో కేవలం రెండు టవర్లు మాత్రమే ఏర్పాటు చేసి, మిగిలిన పనులను అసంపూర్తిగా వదిలేశారని వివరించారు. టవర్లు ఏర్పాటు చేసినప్పటికీ విద్యుత్ వైర్లు లాగకపోవడంతో పనులు పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాలేదని తెలిపారు.

పనులు పూర్తయిన తర్వాతే బిల్లులు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులన్నీ పూర్తిచేసిన తర్వాతే బిల్లులు సమర్పించాలని కాంట్రాక్టర్‌కు స్పష్టం చేసినట్లు డీఈ తెలిపారు. అయినప్పటికీ అధికారుల సూచనలను పట్టించుకోకుండా, బిల్లుల చెల్లింపులో అధికారులు సహకరించడం లేదంటూ కార్యాలయానికి వచ్చి ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే చేపట్టిన పనులకు సంబంధించి ఎల్ఓసీ ఇచ్చినప్పటికీ, మిగిలిన పనులు పూర్తిచేయకుండా అధికారులపై ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

ప్రజాధనంతో చేపట్టిన పనుల్లో నాణ్యతే లక్ష్యం

ప్రభుత్వ నిధులతో చేపట్టే విద్యుత్ పనులు నాణ్యతతో, పూర్తిస్థాయిలో జరగాలన్నదే తమ లక్ష్యమని చింతమల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులతో చర్చించి, కార్యాలయ కార్యకలాపాలకు ఆటంకం కలిగిస్తూ తప్పుడు ఆరోపణలు చేస్తున్న కాంట్రాక్టర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు.ఈ విలేకరుల సమావేశంలో విద్యుత్ శాఖ ఏఈ కోక్య నాయక్ పాల్గొన్నారు.

ఆచరణాత్మక పరిజ్ఞానంతో ఉజ్వల భవిష్యత్తుకు పునాది



⏭ప్రియదర్శిని చైర్మన్ కాటేపల్లి నవీన్ బాబు

టీ మీడియా, అక్టోబర్ 30,ఖమ్మం రూరల్ :

ప్రియదర్శిని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ (అటానమస్) కళాశాలలో ఐబీఎం స్కిల్స్‌బిల్డ్ సహకారంతో హెచ్‌అండ్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో అక్టోబర్ 30, 31 తేదీల్లో "నెక్స్ట్‌జెన్ బీటెక్ ఇంజినీర్స్: ఏఐ అండ్ ఇన్నోవేషన్" అనే అంశంపై రెండు రోజుల వర్క్‌షాప్ ప్రారంభమైంది.ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కాటేపల్లి కె. నవీన్ బాబు మాట్లాడుతూ, ప్రస్తుత సాంకేతిక యుగంలో కృత్రిమ మేధస్సు కీలక పాత్ర పోషిస్తోందని, విద్యార్థులు ఏఐ టూల్స్‌తో పాటు సీ, సీ+ం, డేటాబేస్ వంటి ప్రాథమిక సాంకేతిక అంశాల్లో నైపుణ్యం సాధించి ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు.ప్రిన్సిపాల్ డాక్టర్ బి. గోపాల్ మాట్లాడుతూ, విద్యార్థులు సైద్ధాంతిక పరిజ్ఞానంతో పాటు రియల్‌టైమ్ ప్రాజెక్టులు, ప్రాక్టికల్ నాలెడ్జ్‌పై దృష్టి సారించాలని తెలిపారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె. ప్రియదర్శిని విద్యార్థులు క్రమశిక్షణ, సమయపాలన, ఆత్మవిశ్వాసంతో లక్ష్యాల వైపు ముందుకు సాగాలని సూచించారు. అకడమిక్ డైరెక్టర్ ఎ. వెంకట రమణ ఏఐ ఆధారిత సాంకేతిక రంగాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.స్కిల్స్‌బిల్డ్ టెక్నికల్ యూత్ ట్రైనర్ నదియా నాజ్ మాట్లాడుతూ, ఈ వర్క్‌షాప్‌లో విద్యార్థులకు ఏఐ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నూతన ఆవిష్కరణలపై ఆచరణాత్మక శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ కె. గౌతమి, ఆర్. లక్ష్మీ ప్రసన్న, ఎస్. శిరీష, హెచ్‌అండ్‌ఎస్ విభాగాధిపతి ఎన్. అనిత, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మన్మోహన్ తివారీ, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో రక్తదానం



⏭62 యూనిట్ల రక్తం సేకరణ

టీ మీడియా,అక్టోబర్ 30,దమ్మపేట:

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, పాల్వంచ సబ్‌డివిజనల్ పోలీస్ అధికారి సూచనలతో అశ్వారావుపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో దమ్మపేట పోలీస్‌స్టేషన్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దమ్మపేట, అశ్వారావుపేట మండలాలకు చెందిన యువకులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ శిబిరం ద్వారా మొత్తం 62 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ముఖ్య అతిథులుగా దమ్మపేట ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ భవాని, అశ్వారావుపేట ప్రభుత్వ ఆసుపత్రి ఆర్ఎంఓ, వివిధ గ్రామాల సర్పంచులు హాజరయ్యారు. అలాగే దమ్మపేట, అశ్వారావుపేట పోలీస్‌స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.రక్తదానం ద్వారా ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని, యువత సామాజిక బాధ్యతగా ఇలాంటి సేవా కార్యక్రమాల్లో ముందుండాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు రక్తదానంపై అవగాహన కల్పించారు.

ఇళ్ల పత్రాల పంపిణీలో రాజకీయ వివాదం



⏭ సీపీఐ కౌన్సిలర్ల ఆగ్రహం

టి మీడియా, అక్టోబర్ 30 , ఖమ్మం రూరల్:

ఎదులాపురం మున్సిపాలిటీలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ కార్యక్రమం రాజకీయ వివాదంతో రసాభాసగా మారింది. 28, 30, 32వ వార్డుల్లో సీపీఐ కౌన్సిలర్లు పత్రాలు పంపిణీ చేస్తున్న సమయంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు అడ్డంకులు సృష్టించారని కౌన్సిలర్లు దండి రంగారావు, మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి, దండి శ్రీజ ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో రాజకీయ జోక్యం తగదని, ప్రజల చేత ఎన్నికైన కౌన్సిలర్లకు తగిన గౌరవం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై మున్సిపల్ కమిషనర్ అల్లా శ్రీనివాస్ రెడ్డి తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

చివరి దశకు నీటి కోసం వినతి పత్రం



టీ మీడియా, అక్టోబర్ 30 ,పెబ్బేరు:

వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం రాంపురం గ్రామానికి చెందిన రైతులు వారి పంటలకు నీరు అందడం లేదని టిపిసిసి రాజీవ్ పంచాయతీరాజ్ సంఘటన్ రాష్ట్ర అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లగా వారు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ వినోద్ కుమార్ ని కలిసి రైతుల విజ్ఞప్తిని వారి దృష్టికి తీసుకురావడం జరిగింది పంటలు చివరి దశకు వచ్చాయని సరైన సమయంలో నీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు నవంబర్ చివరి వరకు నీరు అందిస్తే పంటలు చేతికి వస్తాయని వారు జెయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది ఈ సందర్భంగా ఇరిగేషన్ డిపార్ట్మెంట్ తో మాట్లాడి నీటి విడుదలకు సహకరిస్తామని రైతులకు హామీ ఇవ్వడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో రాంపురం గ్రామ రైతులు ప్రజలు నాయకులు పాల్గొన్నారు

గృహప్రవేశ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్



టీ మీడియా, అక్టోబర్ 30 ,నారాయణఖేడ్:

మాద్వర్ గ్రామానికి చెందిన బేగారి మంజుల సాయిలు నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో ఖేడ్ మున్సిపల్ చైర్మన్ నగేష్ శెట్కార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన గృహానికి రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశాన్ని ప్రారంభించి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని, ఇల్లు లేని ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ పథకం ద్వారా సొంత ఇల్లు నిర్మించి అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ స్వరూప సంజీవ్ నియోజకవర్గం ఎస్టీ సెల్ అధ్యక్షులు నెహ్రూ నాయక్, మున్సిపల్ కౌన్సిలర్ లక్ష్మణ్, మారుతి,నాగయ్య, కొండల్ రెడ్డి , కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోండి



టీ మీడియా, అక్టోబర్ 30 ,ఆత్మకూరు:

వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఓటు ఇర్నాల్మెంట్ కార్యక్రమంలో భాగంగా బార్ అసోసియేషన్ మెంబర్స్ నీ కలిసిన రాష్ట్ర నాయకులు లక్ష్మీకాంత్ రెడ్డి .రాబోయే ఎమ్మెల్సీ ఎలక్షన్లో ఓటు హక్కు పొందాలంటే కచ్చితంగా డిగ్రీ పాసైన ప్రతి ఒక్కరు ఆన్లైన్ చేసి ఆన్లైన్ ఫామ్, డిగ్రీ మేము, ఆధార్ కార్డు, ఓటర్ ఐడి, జిరాక్స్ పాస్ ఫోటో, తీసుకొని వాటిపై అటస్టడ్ చేయించి ఎమ్మార్వో ఆఫీస్ లో ఇవ్వాలని లక్ష్మీకాంత్ రెడ్డి సూచించార. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎలక్షన్స్ సహా ఇంచార్జీ జిందే జ్యోతి శ్రీనివాసులు , మండల అధ్యక్షుడు అశోక్ భూపాల్ యాదవ్ , జిల్లా నాయకులు ఆనంద్ , జనరల్ సెక్రెటరీ పుల్లారి రమేష్ , నరేష్ కుమార్, రాఘవేందర్ రెడ్డి , సమ్మద్ , పోలేల రాజు, బాలరాజు మొదలైన వారు పాల్గొన్నారు.

భట్టి రాజీనామా చేయాలి,సీపీని బదిలీ చేయాలి

⏭ సామినేని హత్య కేసుపై సీపీఎం ఆగ్రహం

టీ మీడియా,అక్టోబర్30,సింగరేణి(కారేపల్లి):

సీపీఎం సీనియర్ నాయకుడు,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,పాతర్లపాడు మాజీ సర్పంచ్ కామ్రేడ్ సామినేని రామారావు హత్య కేసులో నిజమైన నిందితులను పట్టుకోకుండా విచారణను పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపిస్తూ సీపీఎం సింగరేణి మండల కమిటీ శుక్రవారం ఆందోళన చేపట్టింది.ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,ఖమ్మం పోలీస్ కమిషనర్ దిష్టిబొమ్మలను దగ్ధం చేసి నిరసన తెలిపింది. సీపీఎం సింగరేణి మండల కార్యదర్శి కె.నరేంద్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కొండబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ.. హత్య కేసుతో సంబంధం లేని వారిని అరెస్టు చేసి అసలు నిందితులను తప్పించే ప్రయత్నం జరుగుతోందని తీవ్రంగా ఆరోపించారు.కేసు విచారణపై అనేక అనుమానాలు ఉన్నందున ప్రస్తుత పోలీస్ కమిషనర్‌ను బదిలీ చేసి,ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)తో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.హత్య జరిగి ఏడాది కావస్తున్నా అసలు కుట్ర,దాని వెనుక ఉన్న వ్యక్తుల పాత్రను వెలికితీయడంలో పోలీసు వ్యవస్థ విఫలమైందని విమర్శించారు. “కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు విచారణ సాగుతోంది”అంటూ ఎద్దేవా చేశారు.హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారంటూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కపై తీవ్ర ఆరోపణలు చేసిన ఆయన,నైతిక బాధ్యత వహిస్తూ భట్టి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.సామినేని రామారావు హత్య వెనుక నిజాలను ప్రజల ముందుంచాలి” అని నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేసి ప్రభుత్వ వైఖరిని ప్రజల్లో ఎండగడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకుడు ముక్క సీతారాములు,కార్యదర్శివర్గ సభ్యుడు రేకల మంగయ్య,మండల కమిటీ సభ్యులు ముండ్ల ఏకాంబరం,శ్రీరాములు,తిరపయ్య,సైదులు,కోటయ్య,సంపత్,మంద శ్రీను, బాబు తదితరులు పాల్గొన్నారు.



దివ్య ముహూర్తంలో కొలువుదీరిన జగన్మాత



టీ మీడియా ,అక్టోబర్ 30, ఆళ్లపల్లి :

మార్కోడుగ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం ఉప్పొంగింది. గత రెండు రోజులుగా భక్తిశ్రద్ధలతో, నిష్ట నియమాలతో నిర్వహించిన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం అత్యంత వైభవంగా, శాస్త్రోక్తంగా ముగిసింది. గ్రామంలోని భక్తులందరూ ఏకమై నిర్వహించిన ఈ పూజా కార్యక్రమాలతో మార్కోడు గ్రామం మంత్రముగ్ధమైంది.

నియమనిష్టలతో శాస్త్రోక్త పూజలు

విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో భాగంగా గత రెండు రోజులుగా వేద పండితుల ఆధ్వర్యంలో నిత్య నియమాలతో, హోమాలు, జపాలు, యంత్ర ప్రతిష్టలు మరియు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచే పూజా కార్యక్రమాలలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

ధ్వజస్తంభ దాతలు

అమ్మవారి ఆలయం ఎదురుగా నిర్మించిన ధ్వజస్తంభాన్ని దివంగత రణం శ్రీహరి గారి జ్ఞాపకార్థం వారి కుమారులు రణం శ్రీధర్, రణం మధు, రణం శేఖర్, రణం కృష్ణ అందజేశారు. దాతల కుటుంబానికి ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారుఅమ్మవారి ప్రతిష్టాపన అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తరించారు. గ్రామ కమిటీ సభ్యులు, యువకులు ,గ్రామ పెద్దల సమన్వయంతో కార్యక్రమం దిగ్విజయంగా పూర్తయింది.

వధూవరులను ఆశీర్వదించిన మంత్రి పొంగులేటి

టీ మీడియా ,అక్టోబర్ 30, కూసుమంచి:

కూసుమంచి మండలంలోని గురువాయిగూడెం గ్రామానికి చెందిన నాగిరెడ్డి నారాయణరెడ్డి -- లింగమ్మ దంపతుల కుమారుడు సైదిరెడ్డి, భవాని కీర్తి వివాహం శుక్రవారం నాయకన్ గూడెం గ్రామంలోని పీ వీ కళ్యాణ మండపంలో జరిగింది. ఈ వివాహం కి రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కూసుమంచి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బజ్జూరి వెంకట్ రెడ్డి, సి డి సి చైర్మన్ ఎర్రబోలు సూర్యనారాయణ రెడ్డి, మాజీ ఎంపీటీసీ మాదాసు ఉపేందర్, నాయకులు బొల్లంపల్లి సుధాకర్ రెడ్డి, నాగిరెడ్డి రమేష్ రెడ్డి, లింగారెడ్డి, భారీ వీరభద్రం, గురువాయిగూడెం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బానోతు సత్యం, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహమ్మద్ జహంగీర్ షరీఫ్,మారోజు భీష్మాచారి, జర్పుల శ్రీను నాయక్, కొర్ర రమేష్, కంచర్ల సుధీర్ రెడ్డి, కంచర్ల పవన్ రెడ్డి, సర్పంచులు కంచరకుంట్ల సైదమ్మ, వడిత్య వెంకటేష్ నాయక్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ వైరు చుట్టుకుని పాడి గేదె మృతి

⏭ రూ.లక్ష నష్టం పరిహారం అందించాలని విజ్ఞప్తి

టీ మీడియా,అక్టోబర్30,సింగరేణి(కారేపల్లి):

ఖమ్మం జిల్లా సింగరేణి మండలం తొడితలగూడెంలో విద్యుద్ఘాతంతో పాడి గేదె మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది.గ్రామానికి చెందిన రైతు జక్కుల సర్వేశ్వరరావుకు చెందిన పాడి గేదె విద్యుత్ వైరు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది.రైతు సర్వేశ్వరరావు తన ఇంటి వద్ద ఉన్న షెడ్డులో గేదెను కట్టేసి వ్యవసాయ పనుల నిమిత్తం బయటకు వెళ్లారు.విద్యుత్ స్తంభం నుంచి షెడ్డుకు విద్యుత్ సరఫరా చేసే సర్వీసు వైరుకు మధ్యలో కర్రను సపోర్టుగా ఏర్పాటు చేశారు.అయితే ఆ కర్ర చెదలు పట్టి బలహీనంగా మారింది. గేదె తగలడంతో కర్ర కిందపడిపోయి,విద్యుత్ వైరు గేదె కాళ్లు,మెడకు చుట్టుకుంది. ఈ క్రమంలో వైరు తెగడంతో గేదె విద్యుద్ఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది.మృతి చెందిన పాడి గేదె విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని బాధిత రైతు సర్వేశ్వరరావు తెలిపారు.జీవనాధారంగా ఉన్న పాడి గేదె మృతి చెందడంతో తాను ఆర్థికంగా నష్టపోయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు.ఘటనపై రైతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విద్యుత్ శాఖ అధికారులు,పశువైద్యాధికారి ఘటన స్థలాన్ని పరిశీలించారు.బాధిత రైతుకు ప్రభుత్వం నుంచి తగిన పరిహారం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీటీసీ పెద్దబోయిన ఉమాశంకర్,మాజీ సర్పంచ్ బానోత్ కుమార్ కోరారు.



వివి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు విజ్ఞాన శాస్త్రం బోధన

టీ మీడియా, అక్టోబర్ 30, ఖమ్మం :

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లాలో 2024 డిఎస్సీ ద్వారా నియమించబడిన విజ్ఞాన శాస్త్ర ఉపాధ్యాయులకు రిక్కా బజార్ ఉన్నత పాఠశాలలో “లో కాస్ట్ నో కాస్ట్ పరికరాలతో” ప్రయోగాలను నిర్వహించి ఉపాధ్యాయులకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు అలవాల నాగేశ్వరరావు మాట్లాడుతూ సైన్స్ బోధన విద్యార్థి కేంద్రంగా సైన్స్ బోధన చేయాలన్నారు. విద్యార్థులు ప్రయోగాలు చేస్తూ నేర్చుకోవడం వల్ల విజ్ఞాన శాస్త్రం పట్ల ఆసక్తి, శాస్త్రీయ దృక్పథం పెరుగుతుందన్నారు. దీని కోసం జన విజ్ఞాన వేదిక గత 38 సంవత్సరాలుగాలో కాస్ట్ నో కాస్ట్ మెటీరియల్ తో అనేక బాలోత్సవాలు బాలమేళాలు నిర్వహించిందన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు కెవికె శర్మ, కె.రామారావు, బి.హనుమ, ఇ.వెంకటేశ్వర్లు రిసోర్స్ పర్సన్లగా ప్రయోగాలను చేసి అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమానికి సీఎంఓ ప్రవీణ్ కుమార్, జిల్లా సైన్స్ అధికారి ఆర్ శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.శాంత, మాధవరావు, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఎస్వీ రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేందర్, మోహన్, సూర్యనారాయణ, శ్రీరాములు, పి.రామకృష్ణ, టి.రామకృష్ణ, రాఘవయ్య, డాన్ బాస్కో తదితరులు పాల్గొన్నారు.



ఇళ్ల ప్రొసీడింగ్స్, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



● కార్యాలయంలో పాల్గొన్న ఎ ఎమ్మెల్యే

టి మీడియా, అక్టోబర్ 30 ,ఆత్మకూర్:

దేవరకద్ర నియోజకవర్గం కొకుంట్ల మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో మండలానికి చెందిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసి, రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేసి, అర్హులైన రేషన్ కార్డు లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను మరియు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేసిన దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ఈ సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం కొకుంట్ల మండలాన్ని కేవలం పేరుకే మండల కేంద్రంగా ప్రకటించిందని, కనీసం మండల ప్రకటనను గెజిట్‌లో కూడా పొందుపరచలేదని, ఎమ్మార్వో కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, పోలీస్ స్టేషన్ వంటి కీలక ప్రభుత్వ కార్యాలయాలను సైతం ఏర్పాటు చేయలేదని అన్నారు బిఆర్ఎస్ ప్రభుత్వంలో కొకుంట్ల మండలంలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించలేదని, మన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో మొదటి విడతలో కొకుంట్ల మండలానికి 232 ఇండ్లు ఇవ్వడం జరిగిందని తెలిపారు.గతంలో నిర్లక్ష్యానికి గురైన కొకుంట్ల మండలానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతోందని, ప్రజా సంక్షేమం, గ్రామీణ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని ఎమ్మెల్యే జియంఆర్ గారు స్పష్టం చేశారు.కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధికి అండగా ఉంటూ మరోసారి దీవించాలని ఈ సందర్భంగా కోరిన ఎమ్మెల్యే.

శవయాత్ర దారి మళ్లించాలి



● ఎం ఎల్ ఏ కు చైర్మెన్ కు వినతి పత్రం

టీ మీడియా, అక్టోబర్ 30 ,పెబ్బేరు:

వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలో శవ యాత్ర పై ఎం ఎల్ ఏ మేఘా రెడ్డి కి మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ కు వినతి పత్రం అందించిన స్థానికులు జూనియర్ కాలేజ్ రోడ్డువివిధ రకాల ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు జూనియర్ కాలేజ్ డిగ్రీ కాలేజ్ పొలాలకు వెళ్లే రైతులు రహదారిపై ఎన్నో సంవత్సరాల నుండి పట్టణంలో ఎవరైనా చనిపోతే శవయాత్రలను బాణాసంచలతో డప్పు వాయిద్యాలతో ఈ రహదారి గుండా ఊరేగింపుగా తీసుకెళ్లి వెళ్ళడం జరుగుతుంది ఈ విధంగా చేయడం వల్ల ఆ రహదారి గుండా వెళ్లే విద్యార్థిని విద్యార్థులకు రైతులకు కాలనీవాసులకు తీవ్ర అసౌకర్యం కలుగుతున్నదనీ బాణసంచా పేలుళ్ల కు ముఖ్యంగా పిల్లలు వృద్ధులకు కాలుష్యం బారిన పడుతున్నారు ఇట్టి విషయాన్ని ఎమ్మెల్యే తూడిమేగా రెడ్డి దృష్టికి కూడా తీసుకువెళ్లడం జరిగింది కావున దీనిపైన మున్సిపాలిటీ చైర్మన్ పాలకమండలి మరియు అధికారులు వేరే దారి ఏర్పాటు చేసి విద్యార్థులకు రైతులకు కాలనీవాసులకు ఊరట కలిగించవలసిందిగా విజ్ఞప్తి చేస్తూ దాదాపు 100 మంది 2 వ వార్డు ప్రజల వినతి పత్రాన్ని అందుకున్న మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ సానుకూలంగా స్పందిస్తూ ఈ విషయంలో త్వరగా ఒక నిర్ణయం తీసుకొని ఆ శవయాత్ర దారి మళ్లించేందుకు ప్రయత్నం చేస్తానని చెప్పి హామీ ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కొంతం దయాకర్ రెడ్డి మార్కెట్ వైస్ చైర్మన్ విజయ వర్ధన్ రెడ్డి సర్వారెడ్డి కాంగ్రెస్ నాయకులు రణధీర్ రెడ్డి పరమయ్య సాయిరెడ్డి సునీల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా భవన్ లో స్క్రిప్ట్ తయారు



● భట్టి డైరెక్షన్ లో సీపీ అమలు
● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని


టీ మీడియా, అక్టోబర్ 30, ఖమ్మం:

సీపీ డైరెక్షన్ లో సామినేని రామారావు హత్య కేసు దర్యాప్తు పూర్తిగా పక్కదారి పట్టించేలా సాగుతోందని, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క డైరెక్షన్ లోనే ఈ డ్రామా స్క్రిప్ట్ నడుస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఖమ్మంలోని సుందరయ్య భవన్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రామారావు హత్యలో అసలు హంతకులను, రౌడీలను, గూండాలాను కాపాడేందుకు పోలీస్ కమిషనర్ అన్ని ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. మొదటి నుంచి తాము చెబుతున్నట్లుగానే రామారావు రిమాండ్ రిపోర్ట్ లో 14 మంది సాక్షులను విచారించామని చెప్పినప్పటికీ, అందులో ఇద్దరు ఉద్యోగులు మినహా మిగిలిన వాళ్ళంతా వేరే పేర్లు చెబుతున్నారని స్పష్టం చేశారు. భట్టి విక్రమార్క చెబితే సీపీ సునీల్ దత్ ఈ కట్టు కథ అల్లుతున్నారని విమర్శించారు. హత్య వెనుక అసలు మోటివ్ ను పక్కన పెట్టి, సంబంధం లేని అంశాలను తెరపైకి తెస్తూ తప్పుడు కథలు అల్లుతున్నారని ధ్వజమెత్తారు. రామారావు హత్యకు కారణమైన హంతకులను శిక్షించే వరకు అసలు దోషులు పట్టబడే వరకు సీపీఎం పార్టీ తరపున న్యాయపోరాటం చేస్తామని, రాజీలేని పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ హత్యపై సమగ్ర విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.సీపీ ఖమ్మం జిల్లా ప్రజల ముందు పెద్ద నాటకం చూపించారని అన్నారు. భట్టి మధిర నియోజకవర్గం లో హత్యాకాండ ద్వారా రాజకీయాలు చేస్తున్నారని, ఇప్పటి వరకు సీపీఎం కు చెందిన ముగ్గుర్ని హత్య చేశారని చెప్పారు. భట్టి అన్యాయాలు,అవినీతిని, అక్రమాలు ప్రశ్నించినందుకే సామినేని రామారావు ను హత్య చేశారని ఆరోపించారు.హత్యకు నెల రోజుల ముందు రామారావు పెద్ద ఎత్తున పాదయాత్ర చేశారని పేర్కొంటూ అ సందర్భంగా రామారావు ప్రసంగం ఆడియో ను విలేకరులకు వినిపించారు. భట్టికి సీపీ మొదట నుంచి ఊడిగం చేస్తున్నారని ధ్వజమెత్తరు.ప్రజాభవన్ లో భట్టి సమక్షంలో తయారు చేసిన స్క్రిప్ట్ ను సీపీ అమలు చేస్తున్నారని, కానీ నాటకం అట్టర్ ప్లాప్ కాక తప్పదని అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ లాంటి భట్టి డైరెక్షన్ లో జ్ఞానేష్ కుమార్ లాంటి సీపీ అన్యాయానికి తెర లేపారని విమర్శించారు. ఫారెన్సిక్ టెస్ట్ కు రాలేదని నేరస్తులు అనడం సరికాదన్నారు.సీపీ ఇప్పటికైనా ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. హంతకులను పట్టుకునే దాకా సీపీఎం ఎవర్ని వదిలి పెట్టదని, పెద్ద ఎత్తున పోరాడుతుందని, న్యాయపోరాటం కూడా చేస్తామని చెప్పారు. పొలిటికల్ మర్డర్ అంటున్న సీపీ 10 జన్మ లెత్తినా ఈ కేసును తేల్చలేరని అన్నారు. భట్టి ప్రోత్సాహం తోనే రామారావు ను హత్య చేశారన్నది వాస్తవమని అన్నారు. ఆర్థిక వ్యవహారాలు కూడా కారణమంటున్నారనీ, ఛాలెంజ్ చేస్తున్నామని,అధికారంలో వారే ఉన్నారని,అవేమిటో తెల్చాలని డిమాండ్ చేశారు.

సీపీని తక్షణమే సస్పెండ్ చేయాలి : నున్నా

సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ఐపీఎస్ వ్యవస్థకే కళంకం తెచ్చేలా వ్యవహరిస్తున్న పోలీస్ కమిషనర్ ను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. రామారావు హత్య కేసులో ఏడాది గడిచినా హంతకులను అరెస్ట్ చేయకుండా, పోలీసు శాఖ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు సీపీ కొత్త నాటకాలకు తెరలేపారని విమర్శించారు. విలేకరుల సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్, బండి పద్మ, కళ్యాణం వేంకటేశ్వరరావు, మాదినేని రమేష్, విక్రమ్, పార్టీ సీనియర్ నాయకులు చింతలచెర్వు కోటేశ్వరరావు,మధిర డివిజన్ కార్యదర్శి ఎం. గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

కంపసాటి వీరయ్యకి సంద్ర నివాళు



టీ మీడియా ,అక్టోబర్ 30, కూసుమంచి:

కూసుమంచి మండలంలో రాజుపేట బజార్ గ్రామానికి చెందిన కంపసాటి వీరయ్య శు క్రవారం మృతి చెందగా, ఆయన మృతదేహాన్ని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సంద్ర వెంకట వీరయ్య సందర్శించి, పూలమాల వేసి నివాళు లర్పించారు.మృతుడి కుటుంబ సభ్యులు వెంకన్న, గోవిందు, లింగయ్య, కృష్ణలను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో పెరికసింగారం మాజీ ఎంపీటీసీ మోదుగు వీరభద్రం,గ్రామ సర్పంచ్ శిరీష రవి, ఉప సర్పంచ్ సీతారాములు మౌనిక, రాజుపేట సర్పంచ్ బానోత్ మహేష్, శ్రీనివాసు రెడ్డి వెంకటరెడ్డి, గ్రామ నాయకులు పాల్గొని కంపసాటి వీరయ్య మృతదేహానికి నివాళులర్పించారు.

అమ్మను చంపేస్తా అంటూ



● మైనర్పై మారు తండ్రి లైంగిక దాడి

టీమీడియా , అక్టోబర్ 30 , రంగారెడ్డి జిల్లా:

అభం శుభం తెలియని మైనర్ బాలికపై మారు తండ్రి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ దారుణ ఘటన రంగారెడ్డి జిల్లాలోని బాలాపూర్ ప్రాంతంలో వెలుగుచూసింది. తల్లిని చంపేస్తానని బెదిరిస్తూ ఆరో తరగతి చదువుతున్న బాలికపై నిందితుడు నెల రోజులుగా అఘాయిత్యానికి పాల్పడినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. స్థానికంగా తీవ్ర కలకలం రేపిన ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.వివరాల్లోకి వెళ్తే.. బాలాపూర్ ప్రాంతానికి చెందిన గులామ్ దురానీ అన్వర్ అనే వ్యక్తి తన మారు కూతురిపై లైంగిక వేధింపులకు పాల్పడిన అలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాలిక ఆరో తరగతి చదువుతోంది. గత నెల రోజులుగా బాలికను బెదిరిస్తూ లైంగిక దాడికి పాల్పడుతున్నట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ విషయం బయటకు చెబితే తన తల్లిని చంపేస్తానని బెదిరించడంతో బాలిక భయంతో ఇన్నాళ్లూ ఎవరికీ చెప్పలేకపోయింది.అయితే తాజాగా తల్లి నిందితుడి దారుణాన్ని గుర్తించి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంది. దీంతో బాధిత బాలికతో కలిసి ఆదిభట్ల పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు ఘటనపై విచారణ చేపట్టారు. బాలిక వాంగ్మూలం, ఫిర్యాదు ఆధారంగా నిందితుడు గులామ్ దురానీ అన్వర్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అనంతరం అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

మైనర్ బాలికకు రక్షణగా ఉండాల్సిన వ్యక్తే ఇలాంటి నేరానికి పాల్పడటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాలికకు అవసరమైన రక్షణ, కౌన్సెలింగ్ అందించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. చిన్నారులపై లైంగిక వేధింపులు, దాడుల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

చేతబడి అనుమానంతో తల్లి సజీవ దహనం

● డీజిల్ పోసి, హతమార్చిన కుమారుడు

టీమీడియా , అక్టోబర్ 30 , టేక్మాల్ :

కన్నతల్లికి జ్వరం వచ్చిందని భుజాలపై మోసుకుని మైళ్ల దూరం నడిచే కుమారుడు ఒకపక్క, చిన్న వయసులోనే భర్తను కోల్పోయి కుమారుడే ప్రపంచంగా బతికిన తల్లిని కడతేర్చుతున్న కర్కశ పుత్రులు మరోపక్క. ఈ సమాజంలో కొందరు కసాయి కుమారుల ఆగడాలు చూస్తుంటే కన్నతల్లి కోసం పరితపించే కొడుకులు ఉన్నారంటే నమ్మాలన్నా కష్టంగానే ఉంది. విజ్ఞానాన్ని పెంచే చదువును గాలికొదిలేసిన ఓ కుమారుడు మూఢనమ్మకంతో కళ్లున్నా గుడ్డివాడిగా మారాడు. కంటికి రెప్పలా పెంచిన తల్లి మాటను కాదని తాను నమ్మిందే వేదంగా భావించి ఆమెను అత్యంత పాశవికంగా సజీవదహనం చేసిన హృదయ విదారక ఘటన మెదక్ జిల్లాలో జరిగింది.



సాయవ్వ భర్తను కోల్పోయిన బాధను దిగమింగుకుని ఒక్కగానొక్క కుమారుడిని అల్లారుముద్దుగా పెంచుకుంది. ఉన్నత చదువులు చదివించాలని కలలు కన్నది. తీరా కుమారుడికి వయసొచ్చేసరికి ఆమె కలలన్నీ కల్లలుగా మారాయి. కుమారుడు చదువును గాలికొదిలేసి జులాయిగా మారాడు. చెడు వ్యసనాలకు బానిసైయ్యాడు. జీవనోపాధి కోసం దుర్గేష్ హైదరాబాద్‌లో ఆటో నడిపేవాడు. మూఢనమ్మకంతో తల్లిపై అనుమానం పెంచుకున్నాడు. ఆ అనుమానంతోనే చివరకు ఊహించడానికే వణుకు పుట్టే దారుణానికి ఒడిగట్టాడు.

చిన్న వయసులోనే భర్తను కోల్పోయిన మృతురాలు

మెదక్ జిల్లా టేక్మాల్ మండలం ఎల్లుపేట గ్రామానికి చెందిన సాయవ్వకు చిన్నవయసులోనే పెళ్లైంది. 18 ఏళ్లకే భర్త చనిపోయాడు. అప్పటి నుంచి ఆమె కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేది. వారికి దుర్గేశ్? అనే ఓ కుమారుడు ఉన్నాడు.

1న పుర పోలింగ్‌కు కట్టుదిట్టమైన భద్రత

● 36,351 మందితో బందోబస్తు

టీమీడియా , అక్టోబర్ 30 , అమరావతి బ్యూరో :

నవంబర్ 1న జరగనున్న వంద పట్టణ స్థానిక సంస్థల పోలింగ్‌కు రాష్ట్ర ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తోంది. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా రాష్ట్రవ్యాప్తంగా 36,351 మంది పోలీసు సిబ్బందిని మోహరిస్తోంది. పోలీసు సిబ్బందితో పాటు డ్రోన్లు, సీసీ కెమెరాలు, వీడియో గ్రాఫర్ల ద్వారా నిరంతర నిఘాకు చర్యలు తీసుకుంటున్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగం

వివిధ జిల్లాల్లో 671 పోలింగ్ కేంద్రాలను అత్యంత సున్నితమైనవిగా గుర్తించి వాటి వద్ద 3,355 మందితో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. మరో 1,233 సున్నిత కేంద్రాల కోసం మరో 4,943 మందిని సిద్ధం చేస్తున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎన్నికల సంఘం హెచ్చరించింది. ఓటర్లు ఎలాంటి భయం, ఒత్తిడి, ప్రలోభాలకు గురికాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చింది. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా ప్రజలు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు నిబంధనలను పాటిస్తూ అధికారులకు సహకరించాలని కోరింది.

12,244 కేంద్రాల్లో 1న పోలింగ్

మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలు, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు కలెక్టర్లు, ఎస్పీలు, నగర పోలీసు కమిషనర్లు, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ఉన్నతాధికారులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. 12,244 కేంద్రాల్లో 1న ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభవుతుంది. 1.03 కోట్ల మంది తమ ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్‌కు అవసరమైన సామగ్రిని కార్పొరేషన్లు, మున్సిపల్ కార్యాలయాలకు అధికారులు పంపించారు. వీటిని ఈనెల 31న పోలింగ్ కేంద్రాలకు ప్రత్యేక వాహనాల్లో తరలించనున్నారు.ఇదిలా ఉండగా ఎన్నికల నేపథ్యంలో నామినేషన్? వేసిన అభ్యర్థులు ప్రచారాలు ముమ్మరంగా చేస్తున్నారు. చాలా చోట్ల కూటమి అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు. ఈ ప్రక్రియలో వైఎస్సార్సీపీ చతికిలబడిందని రాజకీయ నిపుణులు వెల్లడిస్తున్నారు.